క్లుప్తంగా

కళాశాలలపై చర్యలకు వినతి



నెల్లూరు (టౌన్): ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులను వసూలు చేస్తూ.. పుస్తకాలు, యూనిఫారాలను విక్రయిస్తున్న యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నరహరి కోరారు. స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో ఆర్ఐఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, కార్యదర్శి ఈశ్వరయ్య, నేతలు కమలాకర్ రావు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి కల్పవృక్ష వాహనసేవ



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కల్పవృక్ష వాహనసేవను కనులపండువగా బుధవారం నిర్వహించారు. చప్పరోత్సవాన్ని ఉదయం జరిపారు. ఉభయకర్తలుగా వేనాటి మల్లికార్జున్‌రెడ్డి, సుస్మిత దంపతులు, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రేణుక ప్రసాద్ వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఆదూరుపల్లి ఫారెస్ట్ ఠాణా తనిఖీ

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి ఫారెస్ట్ ఠాణాను జిల్లా అటవీశాఖాధికారి ఏ చంద్రశేఖర్ బుధవారం రాత్రి తనిఖీ చేశారు. అడవుల సంరక్షణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నానా జాతి మొక్కలతో పాటు జామాయిల్ మొక్కలను పెంచారు. ఏడేళ్లు దాటిన జామాయిల్ మొక్కలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం కటింగ్ చేయాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల మేరకు మార్కెట్ రేటు ప్రకారం జామాయిల్ మొక్కలను కటింగ్ చేసే దానిపై రాపూరు రేంజ్ అటవీ సిబ్బందికి ఆదూరుపల్లి ఠాణాలో అవగాహన కల్పించారు. జామాయిల్ కటింగ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని తెలిపారు.

సిమెంట్ ట్యాంకర్, కారు ఢీ

ఆత్మకూరు: కృష్ణపట్నం నుంచి కర్ణాటకకు వెళ్తున్న సిమెంట్ లోడ్ ట్యాంకర్‌ను బద్వేల్ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు నెల్లూరుపాళెం వద్ద ముంబయి జాతీయ రహదారిపై బుధవారం ఢీకొంది. ఈ ఘటనలో కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. జాతీయ రహదారుల సంస్థ అంబులెన్స్‌లో గాయపడిన ఇద్దరిని నెల్లూరుకు ఆస్పత్రికి తరలించారు.

వృద్ధులను ఆదరించండి



ఆత్మకూరు: వృద్ధులను ఇబ్బందులు పెట్టే వారిని కఠినంగా శిక్షించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోని వృద్ధులను ఆదరణతో చూడాలని ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో నెల్లూరుకు చెందిన హెల్ప్ ఏజ్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల సంరక్షణకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 14567ను ఆర్డీఓ బుధవారం ఆవిష్కరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ వృద్ధులను, తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలదేనన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పి జాన్‌బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 2న స్విమ్మింగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్విమ్మింగ్ పోటీలకు సంబంధించి జిల్లా సబ్ జూనియర్, జూనియర్స్ జట్ల ఎంపికలను వచ్చే నెల 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మధు, కె.సనత్‌కుమార్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో జరిగే ఈ ఎంపికలకు 10 - 17 సంవత్సరాల మధ్య వయసున్న వారు గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3కి అర్హులని తెలియజేశారు. ఆసక్తి గల వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

మణి సంస్మరణ సభ నేడు

నెల్లూరు (వేదాయపాళెం): మణి బుక్‌స్టాల్ వ్యవస్థాపకుడు, హేతువాద ఉద్యమ నేత టీపీ మణి సంతాప సభను టౌన్‌హాల్లోని రీడింగ్ రూమ్‌లో గురువారం సాయంత్రం 5.30కు నిర్వహించనున్నామని నెల్లూరు పట్టణ రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘ కోశాధికారి హఫీజుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వామపక్ష పార్టీల కార్యకర్తలు, అభ్యుదయవాదులు తరలిరావాలని కోరారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



ద్వాక్రా మహిళలకు రుణ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: మహిళా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యల్లాయపాలెం మజరా రామాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. డ్వాక్రా మహిళలకు రూ.1.14 కోట్ల బ్యాంకు లింకేజీ రుణ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళలకు నేరుగా నగదు అందజేస్తే కుటుంబం బాగుపడుతుందన్న ఉద్దేశంతో నేరుగా ఖాతాల్లో జమచేస్తున్నారన్నారు. కుటుంబ అభ్యున్నతికి నిరంతరం పాటు పడే మహిళలకు సంక్షేమ పథకాలు అందజేయడం వల్ల ప్రతి కుటుంబంలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని చెప్పారు. తాను ఏ గడపకు వెళ్లినా ప్రజలు ఆనందంతో ఆశీర్వదిస్తున్నారంటే అందుకు సంక్షేమ పథకాలే కారణమన్నారు. ప్రతి ఇంటా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఇప్పటి వరకు కోవూరు నియోజకవర్గంలోని 71 సచివాలయాల పరిధిలోని 81,700 గడపలు తిరిగామన్నారు. ప్రతిగడపలోనూ ప్రజలు సంతోషంగా స్వాగతం పలుకుతుండడమే వైఎస్సార్‌సీపీ పాలనలో వారు సంతోషంగా ఉన్నారనేందుకు నిదర్శనమన్నారు. మహిళలకు విరివిగా రుణాలు మంజూరు చేయించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న వైకేపీ ఏపీఎం రుక్మిణిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. తొలుత గ్రామంలో రూ.12 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ, ఎంఈఓలు పి సుబ్రమణ్యం, జీ వసంతకుమారి, ఏఓ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసనాక సునీల్‌రెడ్డి, కే వెంకటరమణారెడ్డి, తాటిపర్తి భాస్కర్, సమీ ఉద్దీన్, ఎస్కే.రషీద్, జాజుల మనోజ్, ఎస్కే.ఆరిఫ్, కోరికల గోపి, మాబాషా, టీ ప్రసాద్‌రెడ్డి, డీ సాయిరెడ్డి, వై.పెంచలయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతిరహిత పాలన



మాట్లాడుతున్న నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అవినీతిరహిత పాలన సాగుతోందని కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 4,5 వార్డుల కౌన్సిలర్లు, ప్రజలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన పండగలా సాగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పారదర్శకంగా అర్హులను గుర్తించి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల ప్రజలతో సమావేశమై స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్‌చైర్మన్ షాహుల్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, అల్లాభక్షు, మోర్ల మురళి, విల్సన్, ప్రవల్లిక, బాబు పాల్గొన్నారు.

బీసీల హక్కుల కోసం సంఘటిత పోరాటం



మనుబోలు: బీసీల హక్కుల కోసం సంఘటితంగా పోరాడుదామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య పిలుపునిచ్చారు. మనుబోలులోని పద్మావతి కల్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకులుగానే చూస్తున్నాయన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పిస్తేనే దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ మనుగడ సాధ్యమన్నారు. బీసీ హక్కుల కోసం అందరం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాముఆచారిని సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘ నాయకులు లీలాకృష్ణయాదవ్, అంకయ్య, శేఖర ఆచారి, రాము, మునికృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, నందీశ్వరరావు, యుగంధర్, చిన్నరమణయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు నగదు ప్రోత్సాహకాలు



టాపర్‌కు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

మనుబోలు: 2022-23 విద్యా సంవత్సరంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బుధవారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. జగనన్న ఆణిముత్యాలులో భాగంగా ప్రథమ స్థానంలో నిలిచిన సీహెచ్ తరుణ్‌కు బంగారు పతకంతో పాటు రూ.3 వేలు నగదు ప్రోత్సాహకాన్ని జెడ్పీటీసీ చిట్టమూరు అనితమ్మ చేతుల మీదుగా అందజేశారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన కోసూరు జాహ్నవికి రజత పతకంతో పాటు రూ.2 వేలు నగదు ప్రోత్సాహకాన్ని వైస్‌ఎంపీపీ తిక్కవరపు వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన వెందోటి శిరీషకు రూ.1000 నగదు, ప్రశంసాపత్రాన్ని సర్పంచ్ కంచి పద్మమ్మ చేతుల మీదుగా అందజేశారు. అలాగే పాఠశాల టాపర్‌గా నిలిచిన తరుణ్‌కు ఎక్స్‌అఫిషియో మెంబర్ అనమాల ప్రభాకర్‌రెడ్డి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చిట్టమూరు అజయ్‌రెడ్డి, హెచ్‌ఎం డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు పీహెచ్‌సీలో అంగన్‌వాడీ చిన్నారులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ సురేష్‌కుమార్ 52 మంది చిన్నారులను పరీక్షించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న 11 మంది చిన్నారులను గుర్తించి నెల్లూరులోని ఎన్‌ఆర్‌సీకి పంపించాలని సూచించారు. వారిని ఎన్‌ఆర్‌సీలో పదిహేను రోజుల పాటు ఉంచి మంచి పౌష్టికాహారం అందించనున్నట్లు వైద్యులు తెలిపారు. మైపాడు వైద్యాధికారి విజయ్‌శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గుడి మంజుల,శిరీష, తదితరులు పాల్గొన్నారు.

దిగజారిన నిమ్మ ధరలు



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు : నిమ్మ ధరలు మరింతగా దిగజారాయి. ఇప్పటి వరకు మార్కెట్లో నిమ్మకాయలకు గిట్టుబాటు ధరలు లభిస్తుండగా, వారం రోజులుగా ధరలు దిగజారడంతో కాయల కోత ఖర్చులకు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయటి ప్రాంతాల్లో కాయల దిగుబడి పెరగడం..వాతావరణం చల్లబడడంతోనే ఈ పరిస్థితులు నెలకొన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో నిమ్మకాయలు రూ.15 నుంచి రూ.25 మాత్రమే పలుకుతున్నాయి. కాయల నాణ్యతను బట్టి లూజు బస్తాకు రూ.1,200 నుంచి రూ.2వేలు మాత్రమే ధర లభిస్తోంది. లూజు బస్తా ధర రూ.2వేలకుపైగా ఉండి, కాయల నాణ్యతగా ఉంటేనే రైతులకు కోత ఖర్చులు గిట్టుబాటు అవుతాయి. గతేడాది జూలైలో బస్తా కాయలు రూ.3,500 వరకు ధర పలికినట్లు రైతులు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ మొదటి వారం నుంచే ధరలు పతనమయ్యాయని చెబుతున్నారు.

పెరిగిన దిగుబడులు

బయటి ప్రాంతాల్లో నిమ్మకాయల దిగుబడి పెరగడం, వాతావరణం చల్లబడడంతోనే కాయలకు డిమాండ్ లేకుండా పోయిందని వ్యాపారులు చెబుతున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌లోనూ నిమ్మసాగు విస్తారంగా ఉంది. మన రాష్ట్రంలోని ఏలూరు, తెనాలి, తదితర ప్రాంతాల నుంచి కాయల ఎగుమతి పెరిగింది. దీంతో ఢిల్లీ మార్కెట్‌కు ఎగుమతులు పెరిగాయి. దీనికి తోడు ఉత్తర భారతదేశంలో కురుస్తున్న వర్షాలతో నిమ్మకాయల వాడకం గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా నిమ్మకాయల ధరలు బాగా దిగజారాయి. గతేడాది వర్షాలు కురిసినా ధరలు తగ్గకుండా రూ.3 వేలు పైబడి అమ్మడం విశేషం. ఈ ఏడాది ప్రారంభం నుంచి నిమ్మధరలు నిలకడలేక రైతులకు ఆశించిన రీతిలో ఆదాయం లభించలేదు.

ముత్తుకూరు పోలీసులకు ఎస్పీ ప్రశంసలు



ముత్తుకూరు: ఆస్తుల రికవరీ, బెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో ముత్తుకూరు పోలీసులు అత్యుత్తమ ప్రతిభకనబర్చడంతో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ప్రశంసలతో ముంచెత్తారు. బుధవారం నెల్లూరులో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఎస్సై శివకృష్ణారెడ్డితో పాటు పలువురు సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

నేడు తొలి ఏకాదశి పూజలు

పొదలకూరు : తొలి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు శ్రీవారి మూలవిరాట్‌కు అభిషేకం, 9 గంటలకు విష్ణు సహస్ర నామార్చన, సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, 7.30 గంటలకు పల్లకిసేవ నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే పట్టణంలోని అయ్యప్పనగర్ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి ఆర్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 1755 మందికి గానూ 1637 మంది హాజరయ్యారు. 118 మంది గైర్హాజరయ్యారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెమిస్టర్ పరీక్షలకు 1128 మందికి గానూ 1022 మంది హాజరయ్యారు. 106 మంది గైర్హాజరయ్యారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఇందుకూరుపేట: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కాలవమూల కండ్రిగలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు కిసాన్‌నగర్‌కు చెందిన కందల కొండలరావు (53) ప్లంబింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాలవమూల కండ్రిగలో ఓ ఇంటికి ప్లంబింగ్ పనులు చేసేందుకు ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం మెషిన్‌తో గోడను కట్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ కే రామకృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది మార్చి 23 నుంచి బుధవారం వరకు కానుకల రూపంలో రూ.5,51,652 మేర భక్తులు సమర్పించారని ఈఓ వేణుగోపాల్ తెలిపారు. దేవదాయ శాఖ అధికారి సుధీర్ పర్యవేక్షించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



పొదలకూరు: మాట్లాడుతున్న ఆత్మకూరు ఏసీ వెంకటేశ్వర్లు



కోవూరు: బ్యాంకర్లు, పొదుపు సభ్యులతో సమావేశమైన డీపీఎం చంద్రశేఖర్

పొదలకూరు : మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని వైకేపీ ఆత్మకూరు ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మార్చడంపై శిక్షణా శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ పొదుపు మహిళలను పారిశ్రామికవేత్తలుగా నిలపాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ఇందుకోసం రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలను మంజూరు చేస్తోందన్నారు. పొదుపు మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చిన్నపాటి యూనిట్లను గ్రౌండింగ్ చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం రోజ్‌మేరి, ఎస్‌బీఐ, ఏపీజీబీ, ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్‌ఆఫీసర్లు, సీసీలు, వీఓఏలు, ఎంఎస్, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

కోవూరు: పొదుపు సంఘాల సభ్యులకు కుటీర పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు బ్యాంక్ లింకేజీ డీపీఎం చంద్రశేఖర్ తెలిపారు. మండల సంఘమిత్ర కార్యాలయంలో వివిధ బ్యాంకుల మేనేజర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 60 మంది పొదుపు సభ్యులు కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చారని, వారికి రూ.10 లక్షల వరకు రుణం మంజూరు చేయాలన్నారు. అందుకు బ్యాంక్ మేనేజర్లు తమ వంతు సహాయ సహకారాలు అందించి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ శ్రీలత, ఏపీఎం వెంకటస్వామి, సీసీలు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణ



ఎమ్మెల్యే వితరణ చేసిన ట్రైసైకిల్‌ను అందజేస్తున్న కొండ్లపూడి

ఇందుకూరుపేట: మండలంలోని నిడిముసలికి చెందిన దివ్యాంగుడు తూపిలి వెంకయ్యకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ట్రైసైకిల్‌ను వితరణ చేశారు. వెంకయ్య విన్నపం మేరకు నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.35వేల బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్‌ను పంపిణీ చేశారు. బుధవారం నిడిముసలి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి ద్వారా లబ్ధిదారుడి ట్రైసైకిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు సుధీర్‌రెడ్డి, బత్తల భరత్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ శీరం నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేత



కోవూరు: పాటూరులోని చక్కిరాలదిబ్బ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలకు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి బుధవారం క్రీడాసామగ్రి పంపిణీ చేసినట్లు ఏఎంఓ శాంతకుమారి తెలిపారు. ఇటీవల గిరిజన ప్రాథమిక పాఠశాలను సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో చిన్నారులకు ఆట వస్తువులు లేకపోవడాన్ని గుర్తించి క్రీడాసామగ్రి అందజేశారని శాంతకుమారి వివరించారు. పాఠశాల హెచ్‌ఎం హరిణి, వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ రాధమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త శైలజ, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జీవిత ఖైదీ మృతి

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న వల్లూరు తిరుమలకుమార్(31) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు..బుచ్చిరెడ్డిపాళెం మండలం పెద్దవూరులోని శివాలయం రెండో వీధికి చెందిన తిరుమలకుమార్ అల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2014లో నమోదైన ఓ కేసులో జీవిత ఖైదీగా జిల్లా కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. బుధవారం ఉదయం తిరుమలకుమార్ అనారోగ్యంతో అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఈ విషయంపై ఆర్డీవో మలోల, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి విచారణ జరిపారు. జిల్లా కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి పవన్‌కుమార్

నెల్లూరు (టౌన్): ప్రాథమిక హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అదనపు జిల్లా జడ్జి పవన్‌కుమార్ పేర్కొన్నారు. మూలాపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లలందరూ బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన వర్గాలు, నిరక్షరాస్యులు, అంగవైకల్యం ఉన్న వారికి ఉచిత న్యాయ సాయాన్ని అందించాలనే ఉద్దేశంతో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించారని తెలిపారు. చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ గోపాల్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సేవే పరమావధిగా వృద్ధాశ్రమాలు సాగాలి



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

నెల్లూరు(బృందావనం): సేవే పరమావధిగా వృద్ధాశ్రమాలు సాగాలని 25 కళాసంఘాల అధ్యక్షుడు, హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. హెచ్ ఆర్ ఫొటోగ్రఫీ అధినేత నేదురుమల్లి హరనాథరెడ్డి ఇస్కాన్ సిటీలో స్థాపించిన ద్వారకామాయి వృద్ధాశ్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్పొరేటర్ చేజర్ల మహేష్, డాక్టర్ నిశ్చలప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి, ఆంజనేయరెడ్డి, అందె శ్రీనివాసులు, మోహన్‌రాజు, నందకుమార్, పార్థసారథిరెడ్డి, కళాసంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో భద్రత వారోత్సవాలు



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాలను ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలను జిల్లాలోని అన్ని డివిజన్లలో జూలై రెండు వరకు నిర్వహించనున్నామని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలకు గల ముఖ్య కారణాలు, ప్రమాదాల బారిన పడకుండా పాటించాల్సిన చర్యలను వివరించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, జయకృష్ణారెడ్డి, పరంధామయ్య, బెనర్జీ, మధు, బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, మధు, తదితరులు పాల్గొన్నారు.